నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 8 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

రైతన్నకు బాసటగా నేడు పైళ్ల పర్యటన

ఎండిన పంటలను పరిశీలించనున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 7 : మండలంలోని పలు గ్రామాల్లో ఎండిన పంటలను మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శనివారం పరిశీలించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనగాం పాండు, నీల ఓంప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

ఉదయం 8గంటలకు హన్మాపురం, 8.30కి మన్నెవారిపంపు, 9గంటలకు వడపర్తి, 9.30కి చందుపట్ల, పదింటికి బండసోమారం, 10.30కి గౌస్‌నగర్, 11గంటలకు యర్రంబల్లి, 11.30కి నాగిరెడ్డిపల్లిలో గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు హాజరుకావాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అడుగంటుతున్న భూగర్భజలం

నాన్‌ఆయకట్టులో వట్టిపోతున్న బోర్లు

ఒక్క నెలలోనే మీటరు లోతులోకి నీళ్లు



నకిరేకల్ మండలం ఓగోడులో రైతు శంకర్‌కు చెందిన ఎండిన పొలాన్ని మేస్తున్న జీవాలు

- జిల్లా సగటు 7.74 మీటర్ల దిగువన భూగర్భజలం
- అత్యధికంగా నాంపల్లి, డిండిల్లో పడిపోయిన నీటిమట్టాలు
- మున్ముందు మరింత అడుగంటే ప్రమాదం
- బోర్లుమీద బోర్లు వేస్తున్న రైతులు
- పంటలు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు

నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామంలో బోరు వేయిస్తున్న రైతు మల్లారెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : అసలు వేసవి ముందున్నా.. ప్రారంభంలోనే భూగర్భ జలాలు అథఃపాతాళానికి చేరుకుంటున్నాయి. కొద్దిరోజులుగా వేగంగా నీటి మట్టం పడిపోతుండడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. నాగార్జున సాగర్‌తోపాటు ఏఎమ్మార్పీ ఆయకట్టు వరకు ఇబ్బంది లేకున్నా మిగతా నాన్ ఆయకట్టు ప్రాంతం అంతా సాగునీటి కోసం రైతాంగం అల్లాడుతున్నది. ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఎండలు పెరుగుతుండడంతో పంటలకు నీటి అవసరాలు పెరుగడం తదితర కారణాలతో భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. నెల రోజుల్లోనే మీటరు లోతుకు నీటిమట్టం పడిపోయింది. ఫిబ్రవరి చివరి నాటికి నల్లగొండ జిల్లా సగటు భూగర్భ జల నీటి మట్టం 7.74 మీటర్లుగా నమోదైంది. ఇక వేసవి తీవ్రతతో మరింత వేగంగా భూగర్భ జలాలు పడిపోనున్నాయి. ఇలా నీటిమట్టం పడిపోతుండడం వల్ల పంటలకు నీరు అందిస్తున్న బోర్లు, బావులు క్రమంగా ఎండిపోతున్నాయి. చేతికి ఎదిగిన పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేస్తున్నారు. దీనివల్ల అదనపు భారంతో పాటు అనుకున్న మేర బోర్లు సక్సెస్ కాకపోవడంతో రెండు విధాలుగా నష్టపోతున్న దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ ఏడాది నాన్‌ఆయకట్టులో సరైన వర్షాలు కురువకపోవడంతో ఎక్కడా పెద్దగా చెరువులు, కుంటలు నిండిన దాఖలాలు లేవు. దాంతో భూగర్భ జలాల్లో పెరుగుదల లేదు. సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలతో అందుబాటులోకి వచ్చిన అరకొర నీటితో వానకాలం పంటలు గట్టెక్కినా ప్రస్తుత యాసంగి పంటలు నీటి కోసం అర్రులు చాస్తున్నాయి. దీని వల్ల ఇప్పటికే వేలాది ఎకరాల్లో వరి చేలతోపాటు అక్కడక్కడా పండ్ల తోటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయంగా బోర్లు వేస్తున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా భూగర్భ జల వనరుల శాఖ ఫిబ్రవరి నెలలో సేకరించిన వివరాల ప్రకారం.. జిల్లాలో సగటు లోతు 7.74 మీటర్లుగా నమోదైంది. కొన్ని మండలాల్లో మాత్రం 10మీటర్లకు లోతుకు కూడా నీటి మట్టం పడిపోయింది. దామరచర్లలో 15.94 మీటర్లకు పడిపోగా, నాంపల్లిలో 12.88 మీటర్లు, డిండిలో 12.59, చిట్యాలలో 11.59, చింతపల్లిలో 11.32, మర్రిగూడలో 10.98, కట్టంగూరులో 10.43, మునుగోడులో 10.47మీటర్లతో అత్యధికంగా లోతుల్లోకి భూగర్భజలాలు పడిపోయాయి.

ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఒక్క నెలలోనే మీటరు లోతుల్లోకి నీటి మట్టం పడిపోయింది. జనవరిలో జిల్లా సగటు 6.82 మీటర్లు కాగా, ఫిబ్రవరి చివరి నాటికి 7.74 మీటర్లకు పడిపోయింది. ఇందులోనూ నాగార్జున సాగర్ ఆయకట్టుతో పాటు ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని మండలాలు కూడా ఉండడంతో సగటు నీటిమట్టం ఓ మాదిరిగా కనిపిస్తున్నది. డివిజన్ల వారీగా చూస్తే నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో సగటు నీటి మట్టం 8.59 మీటర్ల లోతున ఉంది. జనవరిలో 7.43 మీటర్లుగా నమోదైంది. అంటే 1.16మీటర్లు పడిపోయాయి. ఇక దేవరకొండ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో పరిశీలిస్తే జనవరిలో సగటున 7.82 మీటర్లుగా ఉంటే ఫిబ్రవరిలో 8.44 మీటర్ల లోతుల్లో ఉన్నాయి. ఇక సాగర్ ఆయకట్టులోని మిర్యాలగూడ డివిజన్‌లోని 10 మండలాల్లో సగటున 6.23 మీటర్ల లోతుల్లో నీరు లభిస్తుంది. ఇదే డివిజన్‌లోని దామరచర్ల మండలంలో మాత్రం ఎక్కడా లేనివిధంగా 11.65 మీటర్ల నుంచి ఒకేసారి 15.94 మీటర్లకు నీటిమట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. మిర్యాలగూడలో 2.07 మీటర్లు, త్రిపురారంలో 2.64 మీటర్లు, వేములపల్లిలో 3.24మీటర్ల లోతుల్లోనే భూగర్భజలాలు అందుబాటులో ఉండడం ఇక్కడ ఉపశమనం. ఇప్పటికి ఇంకా నిండు వేసవి రాక ముందే భూగర్భజలాలు పడిపోతుండగా, ఏప్రిల్, మే నాటికి పరిస్థితి మరింత దిగజారవచ్చు.

నాలుగేండ్లుగా జిల్లాలో భూగర్భ నీటి మట్టం స్థాయి

డివిజన్	ఫిబ్రవరి-2022	ఫిబ్రవరి-2023	ఫిబ్రవరి-2024	జనవరి-2025	ఫిబ్రవరి-2025
నల్లగొండ	4.85	6.05	8.52	7.43	8.59
దేవరకొండ	6.14	5.71	10.35	7.82	8.44
మిర్యాలగూడ	5.71	6.83	10.76	6.18	6.23
మొత్తం	5.47	6.12	10.06	6.82	7.74

నాలుగేండ్లుగా జిల్లాలో భూగర్భ నీటిమట్టాలు

2022 ఫిబ్రవరి	5.47 మీటర్లు
2023 ఫిబ్రవరి	6.12 మీటర్లు
2024 ఫిబ్రవరి	10.06 మీటర్లు
2025 ఫిబ్రవరి	7.74 మీటర్లు

రైతుల భగీరథ ప్రయత్నాలు

భూగర్భ జలాలు పడిపోతున్న నేపథ్యంలో నాన్‌ఆయకట్టులో వరి పంటకు తీవ్ర నీటిఎద్దడి ఎదురవుతున్నది. దాదాపు ప్రతి రైతుది అరెకరమో... ఎకరమో పంట ఎండిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పంటలు కాపాడుకునేందుకు రైతులు కొత్తగా బోర్లు వేస్తూ భగీరథ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో రైతు మూడుచ నాలుగు బోర్లు వేస్తున్నారు. ఒక్కో బోరుకు సగటున 40వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఇలా వేస్తున్న బోర్లల్లోనూ పెద్దగా సక్సెస్ రేట్ లేకపోవడం ఆందోళనకు గురిచేస్తుంది. ఓ వైపు పంట ఎండిపోవడం, మరోవైపు కొత్త బోర్లకు పెట్టుబడి అదనపు భారంగా మారుతున్నది. నల్లగొండ చుట్టుపక్కల మండలాల్లో గత నెల రోజుల్లోనే 3వేల వరకు కొత్తగా బోర్లు వేసినట్లు బోర్ వెల్స్ యజమానుల లెక్కలు చెప్తున్నాయి. పంటలు కాపాడుకోవడానికి ఈ నెల కీలకం కావడంతో బోర్‌వెల్స్ విరామం లేకుండా నడుస్తున్నాయి. ఒక్కో బోర్ యజమానికి రోజు కనీసం ఐదు నుంచి ఆరు బోర్లు వేస్తున్నట్లు సమాచారం. ఏదైనా బోర్ బండి ఒక ఊరికి వెళ్తే అక్కడే రోజులకొద్దీ గిరాకీ ఉంటున్నట్లు చెప్తున్నారు. ఇప్పటికే అరకొర రుణమాఫీ, రైతుభరోసా రాని పరిస్థితులతో రైతులు సతమతం అవుతున్నారు. తాజాగా భూగర్భజలాల దెబ్బ నాన్‌ఆయకట్టు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది.

రైతుబంధు లేదు.. సాగునీరు లేదు

ఆరెకరాల పొలంలో వరి సాగు చేస్తే ఉన్న బోర్లు ఇంకిపోయి, సాగు నీళ్లు లేక మూడెకరాల పంట పశువులకు మేతయ్యింది. కరెంటు సక్కగ రాక లో ఓల్టేజీతో మోటారు కాలిపోయింది. ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు ఇయ్యలేదు.. రుణమాఫీ చెయ్యలేదు.. పంట పొలాలకు నీళ్లు ఇచ్చే పరిస్థితీ లేదు. ఒక్కో ఎకరానికి రూ.7వేల చొప్పున మూడెకరాలు దున్నకాలకు రూ.21 వేలు ఖర్చు చేశా. నాటు వేసేందుకు ఎకరానికి రూ.7 వేల చొప్పున మళ్లీ ఓ 21 వేలు అయ్యింది. పిండి బస్తాలకు రూ.9 వేలు, రెండుసార్లు పంటలకు కొట్టిన పురుగు, తెగులు నివారణ మందులకు రూ.10 వేలు. నీళ్లు లేక బోర్లు వట్టిపోయి పంట ఎండిపోయింది. మిగిలిన మూడెకరాలను కాపాడుకుందామనుకుంటే 12 గంటలు కూడా సక్కగ త్రీఫేజ్ కరెంటు ఇస్తలేరు. అరగంట కరెంటు ఇస్తే గంట కోస్తున్నరు. ఇందులోనే 8 సార్లు కరెంటు వస్తది, పోతది. లో ఓల్టేజీ వల్ల ఉన్న ఒక్క మోటారు కూడా కాలిపోయింది. చుట్టుపక్కల చెరువుల్లో నీళ్లు లేక బావులు ఎండిపోయినయ్, బోర్లు ఇంకిపోయినయ్. ఈ మూడెకరాలు కూడా కాపాడుకోకపోతే పెళ్లాం, పిల్లలను ఎట్లా సాదాలి? ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

- మండల శంకర్, రైతు, ఓగోడు (నకిరేకల్ మండలం)

మూడు బోర్లు వేస్తే ఒక్కటి అంతంత మాత్రం పడ్డది

నాకున్న రెండెకరాల భూమిలో పత్తి పంట వేశాను. మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని వరి పొలం చేస్తున్నా. ఈ యాసంగి ఒక్కసారిగా నీళ్లు అడుగంటి బోర్లు పోయకపోవడంతో మూడెకరాల వరి ఎండిపోయింది. చేసేది లేక అందులో పశువులను మేపుతున్నా. నీళ్లు అందకుంటే ఉన్న మూడెకరాలు కూడా ఎండి పోయేట్టు ఉంది. దాంతో మూడు బోర్లు వేస్తే ఒక్క బోరు మాత్రం అంతంత మాత్రం పడ్డది. పెట్టుబడి కూడా దక్కుతదో, లేదో అన్నట్లు తయారైంది మా పరిస్థితి.

–కాసార్ల మల్లారెడ్డి, కౌలు రైతు, అప్పాజీపేట (నల్లగొండ రూరల్)



యాదగిరిగుట్టలో స్వామివారి ఎదుర్కోలు మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

- అశ్వవాహనంపై తరలివచ్చిన నరసింహస్వామి

యాదగిరిగుట్ట, మార్చి7 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఎదుర్కోలు పర్వం కన్నులపండువగా సాగింది. భక్తజనుల జయజయ ధ్వనులు, అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలు, కళాకారుణుల నృత్యాల నడుమ స్వామి వారు ఆశ్వవాహనంపై ప్రధానాలయం కల్యాణ మండపం నుంచి ఉత్సవ మండపానికి ఊరేగింపుగా వచ్చారు. లక్ష్మీనరసింహుడిని తూర్పు అభిముఖంగా, అమ్మవారిని పశ్చిమదిశకు అభిముఖంతో ప్రతిష్ఠించారు. అధికారులు, అర్చకులు, రుత్వికులు ఇరువైపులా ఆసీనులై పెండ్లి పెద్దలుగా వ్యవహరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఎదుర్కోలు విశేషాలను ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు వివరించారు. స్వామి వారి కల్యాణం అమ్మవారితో శనివారం రాత్రి జరిపేందుకు సుముహూర్తం నిశ్చయించారు. ఉదయం ముగ్ధమనోహరంగా జగన్మోహినీ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావు, డీఈఓ దోర్భల భాస్కర్ శర్మ, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణ మహోత్సవం

బ్రహోత్సవాల్లో కీలక ఘట్టమైన లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపంలో ఈ వేడుక జరిపించనుండగా.. వేదిక ముందు భాగంలో వీవీఐపీ, వీఐపీ, మీడియా, దాతలు, దేవస్థానం అధికారులు, డోనర్లు, కల్యాణంలో పాల్గొనే భక్తులకు వేరువేరుగా లాబీలు సిద్ధం చేస్తున్నారు. కల్యాణోత్సవాన్ని 10 వేల మంది వీక్షించే విధంగా కొండపైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ మహోత్సవానికి మంత్రులు రానున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో రైతుల అరిగోస

- విద్యుత్ లో ఓల్టేజీ.. సాగునీటి సమస్యతో ఎండుతున్న పంటలు
- నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- మాసాయిపేటలో ఎండిన వరి పంట పరిశీలన

యాదగిరిగుట్ట, మార్చి 7 : ఎక్కడ చూసినా విద్యుత్ లో ఓల్టేజీ సమస్య, పొట్ట దశలో నీళ్లందక ఎండిపోయిన పంటలే కనిపిస్తున్నాయని, రైతు గోస చూస్తుంటే దుఃఖం తన్నుకొస్తున్నదని డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మాసాయిపేట గ్రామంలో కుటుంబసభ్యుల బంగారం తాకట్టు పెట్టి నాలుగెకరాల్లో వరి సాగు చేసి, నీళ్లు లేక ఎండిపోయి మనోవేదనకు గురవుతున్న రైతు ఎమ్మ శ్రీకాంత్ పొలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. శ్రీకాంత్‌ను ఓదార్చారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో విద్యుత్ లో ఓల్టేజీతోపాటు సకాలంలో సాగు నీరందక వేల ఎకరాల్లో వరి ఎండిపోయిందన్నారు. మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ఎద్దేడ్చిన ఎవుసం. రైతేడ్చిన రాజ్యం నిలువలేదని, సీఎం రేవంత్ సర్కారు పతనం కూడా ఖాయమని పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో లేని లో ఓల్టేజీ సమస్య 15 నెలల్లో ఎందుకు వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. కాళేశ్వరం జలాలు విడుదల చేస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే రేవంత్ రైతులను అరిగోస పెట్టిస్తున్నాడని మండి పడ్డారు. తన పేరు నీళ్ల అయిలయ్య అంటూ ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యేను రైతులు కురువు తెచ్చిన అయిలయ్యగా పిలువాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే ఎండిపోయిన పంటలు, రైతులను ప్రభుత్వం తరపున ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేలు పరిహారం అందించాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, పాల సంఘం మాజీ చైర్మన్ వంటేరు ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ వంటేరు సువర్ణ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంటేరు సురేశ్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి బాబురావు, మాజీ ఎంపీటీసీ గొట్టిపర్తి బాలరాజు, నాయకులు సొప్పరి మధు, నర్సింగరావు, వాకిటి కిష్టయ్య, మహేందర్, యాదగిరి, రషీద్, భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన దుర్మార్గం : యువ రైతు శ్రీకాంత్

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కాళేశ్వరం జలాలు అందిస్తానని హామీ ఇస్తే బంగారం కుదువబెట్టి నాలుగెకరాల్లో వరి సాగు చేసినట్లు రైతు శ్రీకాంత్ వాపోయాడు. నాలుగు నెలలైనా నీళ్లు రాలేదని, కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోయాయని తెలిపాడు. నాలుగెకరాలకు రూ.లక్ష పెట్టుబడి పెడితే పంట మొత్తం ఎండిపోయిందని ఆవేదన చెందాడు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే గానీ, అధికారులు గానీ వచ్చి ఎండిన పంటలను చూసింది లేదని మండిపడ్డాడు.

మహిళలకు మొండి చెయ్యి

అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ అర చేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ తీరా అధికారంలోకి వచ్చాక హామీలకు ఎగనామం పెట్టింది. మహిళలకు ఇచ్చిన దాదాపు అన్ని హామీలను తుంగలో తొక్కింది. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం, మహాలక్ష్మి కింద నెలకు రూ.2,500, కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛను పెంపు వంటి హామీలేవీ అమలు చేయకుండా మొండి చెయ్యి చూపిస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, మార్చి 7 (నమస్తే తెలంగాణ)

ఎన్నికల ఇచ్చిన హామీల ప్రకారం అధికారంలోకి వచ్చాక ఆయా పథకాల కోసం అన్ని వర్గాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. 2023 డిసెంబర్ 28న ప్రజాపాలన పేరుతో మొదలుపెట్టి జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో దరఖాస్తులు స్వీకరించారు. మహిళలకు సంబంధించిన పథకాల కోసం మొత్తంగా 12.06లక్షల అప్లికేషన్లు వచ్చాయి. కానీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా ఏదీ అమలు చేయలేదు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసింది. ఆడపిల్లల పెండ్లి సమయంలో పేద తల్లిదండ్రులకు ఆసరాగా నిలిచేందుకు రంఛనుగా ఖాతాల్లో రూ. 1,00,116 జమ చేసింది. అయితే తమకు అధికారం ఇస్తే అందుకు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ గొప్పలకు పోయింది. పెండ్లికి ముందే లగ్న పత్రిక చూపించి దరఖాస్తు చేసుకుంటే కల్యాణలక్ష్మి నగదు సాయంతోపాటు ఇందిరమ్మ కానుక కింద తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికింది. కానీ తులం బంగారం ఊసే లేదు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 3వేల వరకు పెండింండ్లు జరిగాయి. మరోవైపు కల్యాణ లక్ష్మి చెక్కులు కూడా పెండింగ్‌లో మూలుగుతున్నాయి.

రూ.2,500 సాయానికి 2.32లక్షల దరఖాస్తులు

కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు నెలకు రూ.2,500 ముఖ్యమైంది. గత ఎన్నికల్లో ఈ హామీ ఎంతో ప్రభావితం చేసింది. ప్రస్తుతం అనేక సమస్యల మధ్య మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కొనసాగుతుండగా.. రూ.2,500 పథకం అమలు చేయలేదు. 18 ఏండ్లు దాటిన మహిళల అకౌంట్‌లో నెలనెలా జమ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ప్రారంభించలేదు. మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు. దీని కోసం జిల్లాలో 2.32 లక్షల మంది ఆడబిడ్డలు దరఖాస్తు చేసుకున్నారు. పథకం అమలు కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.

అడ్రస్ లేని స్కూటీలు

కాలేజీకి వెళ్లే విద్యార్థినులకు స్కూటీ ఇస్తామన్న కాంగ్రెస్ వాగ్దానం గాల్లో కలిసింది. 18 ఏండ్లు, అంతకంటే పైబడిన వయస్సు వారికి ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ కార్యాచరణ రూపొందిస్తున్నామంటూ హడావుడి చేశారు. తీరా ఎన్నికల ముగిశాక అటకెక్కించారు. సమయం గడిచిపోతుండడంతో కాలేజీ విద్య పూర్తి చేసుకుంటున్న విద్యార్థినులు స్కూటీ కోల్పోయే అవకాశం ఉందని వాపోతున్నారు.

ఎన్నికల హామీలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

- పత్తాలేని ఇందిరమ్మ కానుక తులం బంగారం
- మహాలక్ష్మి కింద నెలకు రూ.2,500 ఊసేది?
- కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఎక్కడ?
- పింఛన్లు పెంచేదెప్పుడు?
- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌కూ మంగళం
- అమలు కోసం ఎదురు చూస్తున్న మహిళా లోకం

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఇంకా మరెన్నో..

దేశంలోనే ఎక్కడా లేనివిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. ఈ పథకం కింద ఆర్థిక సాయంతోపాటు కిట్ ఇచ్చేవారు. ఇప్పుడు ఇది కూడా బంద్ అయ్యింది. గర్భిణులకు పౌష్టికాహారం అందించడం కోసం న్యూట్రిషన్ కిట్ అమలు చేయగా.. అదీ పత్తాలేకుండా పోయింది. 1,962 రూపాయల విలువైన కిట్‌తో గర్భిణుల్లో రక్త హీనతను నివారించి, మాతా శిశు మరణాలను తగ్గించాలని సంకల్పించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. ఒంటరి మహిళలు, బీడీలు చుట్టి జీవనం సాగిస్తున్న మహిళా కార్మికులు, వితంతువులకు పింఛన్ పెంచుతామని చెప్పి పెంచనేలేదు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన పింఛన్ మొత్తాన్నే ఖాతాల్లో జమ చేస్తున్నారు. అవీ సమయానికి అందడం లేదు. మహిళల పేరిట ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పినా ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లు తయారైంది.

హామీల మాట ఎత్తని ప్రభుత్వం

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు మహిళలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. అధికారంలోకి వచ్చాక చెప్పిన ఏ హామీ కూడా నెరవేర్చలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన కేసీఆర్ కిట్‌ను బంద్ పెట్టారు. కొత్త పింఛన్ల మాటే ఎత్తడం లేదు. మహిళల భద్రతకు కూడా భరోసా కరువైంది. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి సరిపడా బస్సులు తిప్పకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు.

–సుర్వి సులోచన, గృహిణి, అంకిరెడ్డిగూడెం, చౌటుప్పల్

ఏడాది దాటింది.. ఇంకెప్పుడిస్తారు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను మర్చిపోయింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసేలేదు. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి అసలు దాని గురించే మాట్లాడటం లేదు. కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ కూడా అందరికీ రావడం లేదు. అమలు కాని హామీలిచ్చి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

– బీసు ధనలక్ష్మి, ఆత్మకూరు(ఎం)